క్లుప్తంగా

వలంటీర్లకు నియామక పత్రాలు



నియామక పత్రాలు ఇస్తున్న కమిషనర్ రమేష్‌బాబు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి మున్సిపాలిటీ పరిధిలో నూతనంగా ఎంపికైన ఆరుగురు వలంటీర్లకు శుక్రవారం కమిషనర్ రమేష్‌బాబు నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వలంటీర్లు తమ పరిధిలో అర్హులైన వారందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేయాలన్నారు.

సీసీరోడ్ల నిర్మాణానికి రూ.60 లక్షలు మంజూరు

ఏర్పేడు: మండలంలోని పలు గ్రామాల్లో సిమెంట్ రోడ్ల నిర్మాణానికి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ నిధులు రూ.60 లక్షలు మంజూరైనట్టు ఎంపీడీవో గిడ్డయ్య శుక్రవారం తెలిపారు. మండలంలోని కందాడు, ఏర్పేడు, చింతలపాలెం, అముదూరు, బండారుపల్లి, మడిబాక, ఇసుకతాగేలి, పాతవీరాపురం, గుండ్లకండ్రిగ, మర్రిమంద, అంజిమేడు, చెల్లూరు, పెనుమల్లం, ముసలిపేడు గ్రామాల్లో సిమెంట్ రోడ్ల నిర్మాణాలు చేపట్టనున్నట్టు పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందినట్లు వెల్లడించారు.

11న హైదరాబాద్‌లో ఎమ్మార్పీఎస్ బహిరంగ సభ



కొత్తవీరాపురం అరుంధతీవాడలో కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఏర్పేడు: ఈ నెల 11వ తేదీన హైదరాబాద్‌లో ఎమ్మార్పీఎస్ బహిరంగ సభ నిర్వహించనున్నట్టు ఆ సంఘం నాయకులు తెలిపారు. వారు శుక్రవారం చెన్నంపల్లి, మునగలపాళెం, రావిళ్లవారికండ్రిగ, కొత్తవీరాపురం అరుంధతీవాడల్లో బహిరంగ సభపై ప్రచారం చేశారు. ప్రతి ఒక్కరూ తరలివచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు. ఎమ్మార్పీఎస్ నాయకులు వెంబటి రాధాకృష్ణ మాదిగ, రాజా మాదిగ, ఈశ్వర్ మాదిగ, యతీష్ మాదిగ, వెంకటముని మాదిగ, వినీత్ మాదిగ పాల్గొన్నారు.

ఘనంగా వేమలమ్మకు పొంగళ్లు



పొంగళ్లు పెడుతున్న మహిళలు



వేమలమ్మకు పూజ చేస్తున్న పూజారి

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కనమనంబేడు గ్రామదేవత వేమలమ్మకు శుక్రవారం గ్రామస్తులు భక్తి శ్రద్ధలతో పొంగళ్లు పెట్టారు. అమ్మవారి విగ్రహానికి పాలాభిషేకం చేసి, పూలతో అలంకరించి, ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

ద్విచక్ర వాహనం చోరీపై కేసు నమోదు

ఏర్పేడు: మండలంలోని పాపానాయుడుపేటలో ద్విచక్ర వాహనం చోరీపై కేసు నమోదు చేసినట్లు ఏర్పేడు సీఐ శ్రీహరి శుక్రవారం తెలిపారు. పాపానాయుడుపేటకు చెందిన గిరి ఈ నెల 1వ తేదీన తన ద్విచక్ర వాహనాన్ని హెయిర్ సెలూన్ వద్ద ఉంచాడు. మధ్యాహ్నం తిరిగి వచ్చి చూడగా ద్విచక్ర వాహనం కనిపించలేదు. పాపానాయుడుపేట పరిసర గ్రామాల్లో వెతికినా వాహనం కనిపించలేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.

జగనన్న ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయండి



మాట్లాడుతున్న ఏఈ సుబ్రమణ్యం

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో జగనన్న ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని హౌసింగ్ ఎఈ సుబ్రమణ్యం ఆదేశించారు. జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాలపై శుక్రవారం ఆయన బుచ్చినాయుడుకండ్రిగలోని తన కార్యాలయంలో సచివాలయ ఇంజినీరింగ్ అసిసెంట్లతో సమీక్షించారు. 85 ఇళ్ల నిర్మాణం పూర్తి స్థాయిలో ఉందని, 341 ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయని, వీటిని త్వరతిగతిన పూర్తి చేయించాలన్నారు. గ్రామాల్లోని ఇళ్ల వద్ద వ్యక్తిగత ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలన్నారు. నిర్మాణాలను బట్టి వారికి బిల్లులను, సిమెంట్‌ను చెల్లిస్తామన్నారు. కార్యక్రమంలో సిబ్బంది యుగంధర్,

జగనన్నను మళ్లీ సీఎం చేద్దాం

- ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పార్టీ శ్రేణులకు పిలుపు
- పిచ్చాటూరులో వైఎస్‌ఆర్‌సీపీ నియోజక వర్గ స్థాయి కంట్రోల్ రూమ్ ప్రారంభం



వైఎస్‌ఆర్‌సీపీ నియోజకవర్గ స్థాయి కంట్రోల్ రూమ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

పిచ్చాటూరు: చిన్న చిన్న విభేదాలు పక్కన పెట్టి పక్కనబెట్టి 2024లో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రి చేయడానికి పార్టీ శ్రేణులు సమష్టిగా పని చేయాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పిలుపునిచ్చారు. శుక్రవారం ఉదయం పిచ్చాటూరులో నియోజకవర్గ స్థాయి వైఎస్‌ఆర్‌సీపీ కంట్రోల్ రూమ్‌ను ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు ఈ కంట్రోల్ రూమ్‌లో 5 కంప్యూటర్లతోపాటు ఐదుగురు ఆపరేటర్లు అందుబాటులో ఉంటారన్నారు. ప్రస్తుతం జరుగుతున్న ఓటర్ల నమోదు, కొత్త ఓటర్లు చేర్పు వంటి కార్యక్రమాలతో పాటు పార్టీకి సంబంధించిన కార్యక్రమ వివరాలు ఇక్కడ తెలుసుకోవచ్చన్నారు. అనంతరం నియోజకవర్గంలోని పార్టీ మండల కన్వీనర్లు, ముఖ్య నాయకుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. సత్యవేడు నియోజకవర్గంలో నిర్వహించిన సర్వేలన్నీ పార్టీదే విజయమని చెబుతున్నాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ప్రజలు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి ఓట్లేసి జగనన్నను మళ్లీ సీఎం చేయడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలుగా జగనన్న చేసిన సంక్షేమాన్ని వారికి వివరించి వారు మనకు ఓట్లేసేలా మలచుకోవాలని కోరారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చూడాలని, పరిష్కారం కాకుంటే తన దృష్టికి తేవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్లు కే.వెంకటచలపతిరాజు(పిచ్చాటూరు), అపరంజిరాజు(నాగలాపురం), విద్యానాథరెడ్డి(బీఎస్.కండ్రిగ), సుశీల్‌కుమార్ రెడ్డి(సత్యవేడు), గవర్ల క్రిష్టయ్య(కేవీబీ పురం), నాయుడు దయాకర్ రెడ్డి(వరదయ్యపాలెం), సారకాయలు(నారాయనవనం), పార్టీ రాష్ట్ర కార్యదర్శి కేవీ భాస్కర్ నాయుడు, పళ్లికొండేశ్వరాలయ చైర్మన్ ఏవీఎం బాలాజీ రెడ్డి, నారాయణవనం ఎంపీపీ దివాకర్ రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు సుదర్శన్ రెడ్డి, రైతు సలహా మండలి చైర్మన్ చిన్నదొరై, పార్టీ జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, తొప్పయ్య, సర్పంచుల సంఘం మండల అధ్యక్షులు రవిరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ పాల పద్మనాభం, నాయకులు నందకుమార్, లాల్‌బాబు యాదవ్, దామోదర్ రెడ్డి, గోపాల్ రెడ్డి, శ్యామ్, చిన్న, మోహన్ తదితరులు పాల్గొన్నారు.



వైఎస్‌ఆర్‌సీపీ నియోజకవర్గ స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

కుంభాభిషేకానికి రూ.10 వేల విరాళం



కుంభాభిషేక పూజల్లో పాల్గొన్న బియ్యపు పవిత్రారెడ్డి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి మండలం ఉడమలపాడు పంచాయతీ శెనగలమిట్ట గ్రామంలో నూతనంగా నిర్మించిన గణపతిస్వామి ఆలయ మహాకుంభాభిషేకం నిర్వహిస్తున్నారు. ఇందులో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కుమార్తె పవిత్రారెడ్డి శుక్రవారం పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ పూజలకు రూ.10 వేలు విరాళంగా గ్రామస్తులకు అందజేశారు. సర్పంచ్ మనోహర్, రమేష్, చిరంజీవి, వెంకట్రామన్, మణి, రామారావు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

శ్మశానానికి స్థలం కేటాయించాలని ఆందోళన



నిరసన వ్యక్తం చేస్తున్న గిరిజనులు


బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కాంపాళెం గ్రామపంచాయతీ చల్లంవారి గిరిజన కాలనీలో శ్మశానానికి స్థలం కేటాయించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం గిరిజనులు శుక్రవారం కాలనీలో ఆందోళన చేశారు. వారు మాట్లాడుతూ, కాలనీలో 30 కుటుంబాలు ఉన్నాయని, మృతి చెందిన వారిని ఖననం చేసేందుకు స్థలం లేక నానా అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీకి ముందు పొలాలున్నాయని, వెనుకవైపు తెలుగుగంగ మెయిన్ కాలువ ఉందన్నారు. దీంతో అంత్యక్రియలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, శ్మశానానికి స్థలం కేటాయించాలని పలుమార్లు రెవెన్యూ అధికారులకు వినతి పత్రాలు ఇచ్చినా పట్టించుకోలేదని నిరసన వ్యక్తం చేశారు. ఇకనైనా దీనిపై స్పందించాలని విజ్ఞప్తి చేశారు.

ముగిసిన కుంభాభిషేకం

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని ఉగ్గుమూడిలో గ్రామస్తులు నూతనంగా నిర్మించిన శివాలయంలో శ్రీ అన్నపూర్ణ సమేత అమరేశ్వరస్వామి కుంభాభిషేకం మహోత్సవం శుక్రవారం ముగిసింది. మూడు రోజులుగా పూజారులు హోమపూజలు చేసి, దేవాలయంపై కలశాలను ఏర్పాటు చేసి, శివలింగం, అన్నపూర్ణదేవి, నందీశ్వరుడు, నవగ్రహాల విగ్రహాలతో పాటు ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. అనంతరం శ్రీ అన్నపూర్ణ సమేత అమరేశ్వరస్వామి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.



నవగ్రహాలు



ధ్వజస్తంభం

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి



విద్యార్థులకు వాలీబాల్ అందజేస్తున్న జ్యోత్స్న

ఏర్పేడు: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని తిరుపతి బీసీ సంక్షేమ సహాయ అధికారిణి జ్యోత్స్న తెలిపారు. ఆమె శుక్రవారం ఏర్పేడు బీసీ హాస్టల్‌ను తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు, పరిసరాలను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ క్రీడలతో శరీరధారుడ్యం పెరుగుతుందన్నారు. అనంతరం ఆమె హాస్టల్ వద్ద మొక్కను నాటారు. విద్యార్థులకు వాలీ బాల్ అందజేశారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ పల్లా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బ్యారికేడ్ల వితరణ



శ్రీసిటీ అందజేసిన బ్యారికేడ్లు

వరదయ్యపాళెం: ట్రాఫిక్ నియంత్రణ కోసం శ్రీసిటీ యాజమాన్యం 20 బ్యారికేడ్లను వరదయ్యపాళెం పోలీస్ స్టేషన్‌కు వితరణ చేసింది. పలు మార్గాలలో ట్రాఫిక్ నియంత్రణకు ఎస్ఐ నాగార్జునరెడ్డి శ్రీసిటీ యాజమాన్యానికి విన్నవించారు. దీనిపై శ్రీసిటీ యాజమాన్యం స్పందించింది. శుక్రవారం సాయంత్రం వరదయ్యపాళెం ఎస్ఐకు బ్యారికేడ్లను అందజేసింది.

టమాటాల వ్యాను బోల్తా



ఇనమాలగుంట వద్ద బోల్తా పడిన మినీ వ్యాను

వరదయ్యపాళెం: టమాటా లోడుతో వెళ్తున్న మినీ వ్యాను బోల్తా పడిన సంఘటన మండలంలోని తడ–వరదయ్యపాళెం ప్రధాన రోడ్డు మార్గంలోని ఇనమాలగుంట వద్ద శుక్రవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. తిరుపతి నుంచి చెన్నైకు వెళ్తున్న టమాల లోడు మినీ వ్యాను ఇనమాలగుంట మలుపు వద్ద అదుపు తప్పి బోల్తా పడింది. ప్రమాదంలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న ఎస్ఐ నాగార్జునరెడ్డి అక్కడికి వెళ్లి పరిశీలించారు. రోడ్డుకు అడ్డంగా పడిన మినీ వ్యాన్‌ను పక్కకు తొలగించారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు.

రేపు శ్వాసకోశ వ్యాధుల ఉచిత వైద్య శిబిరం

తిరుపతి కల్చరల్: డీబీఆర్ రోడ్డు, కొర్లగుంట, మారుతీనగర్‌లోని నారాయణ కళాశాల వెనుక నున్న ఎస్వీ అలెర్జీ అండ్ చెస్ట్ హాస్పిటల్‌లో ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శ్వాసకోశ వ్యాధుల ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆ హాస్పిటల్ ఎండీ, ప్రముఖ శ్వాసకోశ వ్యాధుల నిపుణుడు డాక్టర్ ఎస్.సుబ్బారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో కంప్యూటరైజ్డ్ పీఎఫ్‌టీ, ఎక్స్‌రే, ఈసీజీ, బ్లడ్ షుగర్ వంటి పరీక్షలు ఉచితంగా నిర్వహించి ఇన్‌హేలర్స్, ఇతర మందులు ఉచితంగా అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ వైద్యశిబిరంలో పాల్గొదలచిన వారు 0877-2254208, 7416110259 నెంబర్లలో సంప్రదించి తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బీసీ ఉద్యోగుల మహాసభ రేపు

తిరుపతి కల్చరల్: బీసీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 9 గంటలకు సంస్కృత విద్యాపీఠం వద్దనున్న ఆఫీసర్స్ క్లబ్‌లో జరిగే బీసీ ఉద్యోగుల మహాసభను జయప్రదం చేయాలని బీసీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ అధ్యక్షుడు వంకీపురం పవన్ పిలుపు నిచ్చారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ మహాసభకు బీసీ ఈఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బట్టా భాస్కర్ హాజరు కానున్నారని, బీసీ ఉద్యోగులందరూ ఐక్యతతో హాజరై ప్రథమ మహాసభను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో బీసీ ఈఎఫ్ నేతలు శ్రీనివాసులు, సునీల్ దత్, తులసిరామ్, టి.గోపాల్, కిరణ్, మునికేశవులు, గిరి, శ్రీనివాస్‌ఖ, విజయకుమార్ పాల్గొన్నారు.

వైభవంగా శ్రీజన్మస్థల శివాలయ పునర్నిర్మాణ భూమి పూజ



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

రామచంద్రాపురం: మండలంలోని అనుప్పల్లి పంచాయతీ రేకలచేను గ్రామంలో ఏకవీర ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ప్రతాప్ స్వామీజీ ఆధ్వర్యంలో సమరసతా సేవా ఫౌండేషన్ సహకారంతో శుక్రవారం శ్రీజన్మస్థల శివాలయ పునర్నిర్మాణ భూమి పూజ వైభవంగా నిర్వహించారు. 101 మంది వేద పండితులతో యజ్ఞయాగాది క్రతువులు జరిపించారు. పూజలో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. చంద్రగిరి ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజన ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఏవీ బ్రహ్మానందరెడ్డి, జడ్పీటీసీ ఢిల్లీ భానుకుమార్‌రెడ్డి, వైఎస్ఆర్ సీపీ మండల కన్వీనర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఆలయ ట్రస్ట్ చైర్మన్ గురునాథరెడ్డి, సమరసతా సేవా ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు విష్ణు, వెదురుకుప్పం ఎంపీపీ సుమతి, నాగరాణి, హేమసుందర్ రెడ్డి, సోమేశ్వర్, శివ, భక్తులు పాల్గొన్నారు.

దేవులపల్లి అమర్‌కు సాదర స్వాగతం



రేణిగుంట విమానాశ్రయంలో దేవులపల్లి అమర్‌కు స్వాగతం పలుకుతున్న బాలకొండయ్య

రేణిగుంట: జాతీయ మీడియా, అంతర్రాష్ట్ర వ్యవహారాల సలహాదారు దేవులపల్లి అమర్‌కు శుక్రవారం రేణిగుంట విమానాశ్రయంలో సాదర స్వాగతం లభించింది. ఆయన తిరుపతి జిల్లాలో రెండు రోజుల పర్యటన నిమిత్తం వచ్చారు. ఆయనకు విమానాశ్రయంలో జిల్లా సమాచార పౌరసంబంధాల శాఖ అధికారి బాలకొండయ్య పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం ఆయన తిరుమల దర్శనానికి బయలుదేరి వెళ్లారు.

మెరుగైన వైద్యం అందించేలా చర్యలు



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న వైద్యసిబ్బంది

సత్యవేడు: జగనన్న ఆరోగ్య సురక్ష ఉచిత వైద్య శిబిరాల్లో రోగులను రెఫర్ చేసిన వైద్యశాలల్లో చేర్పించి మెరుగైన వైద్యం అందించేలా పీహెచ్‌సీ డాక్టర్లు చర్యలు తీసుకోవాలని హెల్త్ కమిషనర్ నివాస్(విజయవాడ) ఆదేశించారు. శుక్రవారం మధ్యాహ్నం విజయవాడ నుంచి ఆయన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో దాసుకుప్పం పీహెచ్‌సీ డాక్టర్లు, ఎంఎల్‌పీహెచ్‌ఓలు, ఎంపీడీఓ తదితరులు కాన్ఫరెన్స్‌కు హాజరై వీక్షించారు. కమిషనర్ మాట్లాడుతూ, మండలాల్లో గర్భవతులు నమోదు సమగ్రంగా ఉండాలన్నారు. హైరిస్క్ గర్భవతులను గుర్తించి రక్తహీనత సమస్యలను వారు అధిగమించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే కంటి ఆపరేషన్లు, ఎముకలు, గుండె, హైరిస్క్ గర్భవతులను రెకమెండ్ చేసిన వైద్యశాలల్లో చేర్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చంద్రశేఖర్, దాసుకుప్పం పీహెచ్‌సీ డాక్టర్ ఎస్.గుణశేఖర్, ఎంపీహెచ్‌ఈఓ ఎస్.సుబ్రమణ్య, ఎంఎల్ పీహెచ్‌ఓలు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి ఎమ్మెల్యే ఆర్థిక సాయం



మృతురాలి కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేస్తున్న మన్యం శ్రీనివాసులురెడ్డి

రేణిగుంట: మండలంలోని కరకంబాడి పంచాయతీ తారకరామానగర్ సుందరయ్య కాలనీలో ఆటో డ్రైవర్ ఓబులేశు భార్య లక్ష్మి(45) మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ తారకరామానగర్ ఇన్‌చార్జి మన్యం శ్రీనివాసులురెడ్డి ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే రూ.10 వేలు సాయం అందజేశారు. శ్రీనివాసులు రెడ్డి ఆమె ఇంటికెళ్లి పార్థివ దేహానికి నివాళులర్పించి ఎమ్మెల్యే పంపిన రూ.10 వేలు నగదును కుటుంబ సభ్యులకు అందజేశారు. పార్టీ నాయకులు కృష్ణమూర్తి, రమేష్, ఎంజీ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

అతిథి భవనానికి నూతన శోభ



సత్యవేడులోని జిల్లా పరిషత్ అతిథి భవనం

సత్యవేడు: నియోజక వర్గ కేంద్రంలో పదేళ్లకు పైగా నిరుపయోగంగా ఉన్న జిల్లా పరిషత్ అతిథి భవనాన్ని ఆధునీకరించడంతో నూతన శోభ సంతరించుకుంది. సత్యవేడు జూనియర్ కళాశాల సమీపంలో ఉన్న జెడ్పీ అతిథి గృహం మరమ్మతులకు నోచుకోక శిథిలావస్థకు చేరింది. జిల్లా స్టాండింగ్ కమిటీ మెంబర్, సత్యవేడు జెడ్పీటీసీ సభ్యురాలు పి.విజయలక్ష్మి దీని మరమ్మతులకు రూ.15 లక్షలు జెడ్పీ నిధులు మంజూరు చేయించారు. శ్లాబు, తలుపులు, కిటికీలు, ఫ్లోరింగ్(గ్రానైట్), ఫ్యాన్లు, ఏసీ మెషిన్లు, మరుగుదొడ్లు, విద్యుత్ లైట్ల ఆధునీకరణ పనులు చేపట్టడంతో ఈ భవనం కొత్త సొబగులు అద్దుకుని వినియోగంలోకి వచ్చింది.

సామర్థ్యాల వెలికితీతకే అచీవ్‌మెంట్ పరీక్షలు



సత్యవేడు బాలుర ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఎంఈఓ రవి

కార్వేటినగరం: విద్యార్థుల్లోని సామర్థ్యాలను వెలికితీయడానికే అచీవ్‌మెంట్ పరీక్షలు నిర్వహిస్తున్నట్టు జిల్లా విద్యా శిక్షణా సంస్థ వైస్ ప్రిన్సిపాల్ సుబ్రమణ్యం తెలిపారు. స్థానిక బాలికల ఉన్నత పాఠశాల ప్లస్‌లో శుక్రవారం 3, 6, 9వ తరగతి విద్యార్థులకు నిర్వహించిన సీసీ ఎగ్జామినేషన్ స్టేట్ ఎడ్యుకేషనల్ అచీవ్‌మెంట్ సర్వే పరీక్షలను పరిశీలించారు. ప్రతి విద్యార్థీ ఉన్నత విద్యను అభ్యసించడానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం గాయత్రిదేవి, ఉపాధ్యాయులు, డైట్ ఛాత్రోపాధ్యాయులు పాల్గొన్నారు.

పకడ్బందీగా 'సీస్' పరీక్ష

సత్యవేడు: మండలంలో 35 పాఠశాలల్లో శుక్రవారం నిర్వహించిన స్టేట్ ఎడ్యుకేషనల్ అచీవ్‌మెంట్ సర్వే(సీస్) పరీక్షకు 3,6,9 తరగతుల విద్యార్థులు 751 మంది హాజరయ్యారు. ఎంఈఓ రవి, ఎంఈఓ–2 ఉష పరీక్ష కేంద్రాలను వేర్వేరుగా తనిఖీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు హెచ్.భారతి, శ్రీనివాసులు రెడ్డి, హరినాథుడు తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఐసీడీఎస్ అధికారిణి మృతి



దేవమణెమ్మ(ఫైల్)

శ్రీకాళహస్తి : స్థానిక కొత్తపేటకు చెందిన విశ్రాంత ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆఫీసర్ దువ్వూరు దేవమణెమ్మ(95) శుక్రవారం మృతిచెందారు. ఆమె చిన్నగొట్టిగల్లు మండలంలో పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేశారు. ఆమె స్వాతంత్ర్యోద్యమం, ఆందోళనలను చూసినట్లు మనవలు, మనవరాళ్లు, మునిమనవలకు చెప్పేవారని మృతురాలి కుమారులు రవి, శశి చెప్పారు. ఆమె నాలుగు తరాలను చూశారు. ఆమె భర్త దువ్వూరు రాజదేవసహాయం ప్రముఖ ఆర్‌ఎంపీగా శ్రీకాళహస్తి ప్రజలకు సుపరిచితులు. దేవమణెమ్మ తన జీవిత కాలంలో పలువురు ఎమ్మెల్యేలను చూశారు. కాసాతోటలోని ఎస్‌ఏఎల్‌సీ లూథరన్ చర్చ్ శ్మశాన వాటికలో శనివారం ఉదయం 9గంటలకు అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు తెలిపారు. పట్టణానికి చెందిన పలువురు ఆమె మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

ఒలింపియాడ్‌లో శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ



ప్రశంసా పత్రాలతో శ్రీచైతన్య విద్యార్థులు

శ్రీకాళహస్తి: జాతీయ స్థాయిలో నిర్వహించిన నాలెడ్జ్ అసైన్‌మెంట్ ఒలింపియాడ్‌లో పట్టణంలోని శ్రీరామ్‌నగర్‌కాలనీలోని శ్రీచైతన్య విద్యార్థులు ప్రతిభ చూపారు. ప్రిన్సిపాల్ రూపాదేవి మాట్లాడుతూ తమ పాఠశాల నుంచి 32 మంది విద్యార్థులు పాల్గొనగా 13 మంది రెండో దశకు చేరుకున్నారని పేర్కొన్నారు. ఇందుకు కృషి చేసిన ఉపాధ్యాయులను ఆమె అభినందించారు. అదేవిధంగా ఎంఈవో భువనేశ్వరి విద్యార్థులకు నాసా కిట్లు పంపిణీ చేశారు. దేశం మొత్తం మీద అంతర్జాతీయ స్థాయిలో నాసా నిర్వహించే అంతరిక్షంపై జీవించడం ఎలా అన్న అంశం కాంటెస్ట్‌లో శ్రీచైతన్య విద్యార్థులు ప్రతి సంవత్సరం పాల్గొంటున్నట్టు తెలిపారు. ఏజీఎం సురేష్, డీన్ సుబ్రమణ్యం, ఇన్‌చార్జిలు కల్పన, జానికి, రామ్‌కుమార్, మహీధర్, ఏవో సురేష్ పాల్గొన్నారు.

ఆకాశ కన్నియమ్మకు విశేష పూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

పాలసముద్రం: మండలంలోని వెంగళరాజుకుప్పం పంచాయతీ కోన చెరువు సమీపంలో వెలసిన ఆకాశ కన్నియమ్మకు శుక్రవారం అమ్మవారికుప్పం గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం ఆలయ అర్చకులు అమ్మవారిని పాలు, పెరుగు, చందనం, తేనె, నెయ్యితో అభిషేకం చేశారు. మధ్యాహ్నం మహిళలు పొంగళ్లతో ఊరేగింపుగా ఆలయానికి వచ్చి అమ్మవారికి సమర్పించారు.